వైభవంగా పరమేశ్వరుడి కల్యాణం



స్వామివారి కల్యానంలో పాల్గొన్న భక్తులు

కీసర, మార్చి1: చీర్యాల్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గంగా భ్రమరాంబికా మలికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్స వాలు త్రిశూల స్నానంతో ముగిశాయి. చివరి రోజు శుక్రవారం ఉదయం గవ్యాంత పూజలు, గర్తన్యాసం, యంత్రవి గ్రహ ప్రతిష్ఠాపన, మహాపూర్ణాహుతి, కుంబాభిషేకం, త్రిశూల స్నానం, పార్వతి పరమేశ్వర శాంతికల్యాణం, ఆశీర్వచనం, పండితసన్మానం, తీర్థ ప్రసాదాముల విత రణ కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు వేడుకల్లో ఈ సందర్భంగా మలి కార్జునస్వామి, శివలింగానికి ఆలయ ఛైర్మ న్ మల్లారపు లక్ష్మీనారాయణ దంపతులు, రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ దంపతులు, ధర్మకర్త శ్రీహరిగౌడ్ దంపతులు శ్రీమహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు.



సిడె కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, ఎల్లమ్మ విగ్రహంతో శివసత్తు దస్తప్ప



దండాలు దండాలు
ఎల్లమ్మ తల్లో..

ఘనంగా ఎల్లమ్మ సిడె కార్యక్రమం

బొంరాస్‌పేట్/కొడంగల్ రూరల్: ఎల్లమ్మ తల్లీ కరుణించమ్మా...మమ్మేలు తల్లీ.. అంటూ భక్తులు అమ్మను కొలిచారు. తెలంగాణలో మినీ మేడారంగా పిలవబడే దుద్యాల మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ జాతరలో భాగంగా శుక్రవారం సిడె కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భాజభజంత్రీలు, భక్తుల కోలాహలం మధ్య సిడె తొట్టెలో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేయించారు. భక్తులు గవ్వల బండారం చల్లుతూ, సిడె ముందు బిందెలతో నీళ్ల పోసి గ్రామాలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు ముంబయి, కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్, షోలాపూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శివసత్తు దస్తప్ప ఎల్లమ్మ దేవతా విగ్రహంతో సిడె ముందు నడుస్తూ ఆలయంలో చుట్టు ప్రదక్షిణలు చేశారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఛైర్మన్ జయరాములు, ఈవో ఏర్పాట్లు చేశారు.

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

» జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి1 : ఐదేళ్ల చిన్నారులందరికీ ఈనెల 3న పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పల్స్‌పోలియో కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఆదివారం జాతీయ పల్స్ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లాలో 89,903 మంది ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించడం జరిగిందన్నారు.వీరందరికీ 566 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 1,132 మంది సిబ్బందిని, 57మంది రూట్ సూపర్‌వైజర్లను నియమించడం జరిగిందని తెలిపారు. 25 మొబైల్ టీంలతో పాటు బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్లు, అంగవాడీ కేంద్రాల్లో చుక్కల మందు వేయనున్నట్లు తెలిపారు. మిగిలిన చిన్నారులకు 4,5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలను వేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్, జడ్పీ సీఈవో సుధీర్, డీపీవో, మున్సిపల్ కమిషనర్, విద్యా, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 15 వరకు సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలి

జిల్లాలో మంజూరైన సీసీ రోడ్లకు సంబంధించి నిర్మాణ పనులు ఈనెల 15వ తేదీ వరకు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సీసీపనుల పురోగతిపై సమీక్షించారు. మంజూరైన నిధులతో అంచనాలను రూపొందించుకుంటూ సీసీ రోడ్ల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

కాపీయింగ్ జరగకుండా చూడాలి

ఇంటర్ పరీక్షల్లో కాపీయింగ్ జరగకుండా కఠినంగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం అనంతగిరిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఆంగ్ల పరీక్ష జరుగుతున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులకు వసతులపై ఆరా తీశారు. సమన్వయంతో పని చేస్తూ పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

జీరో కరెంట్ బిల్లుల జారీ



జీరో బిల్లును చూపిస్తున్న వినియోగదారుడు

ధారూరు, మార్చి1: ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద జీరో కరెంట్ బిల్లుల జారీ ప్రారంభమైంది. శుక్రవారం ధారూరులో విద్యుత్ సిబ్బంది పలువురి ఇళ్లలో ఫిబ్రవరి నెలకు సంబంధించిన విద్యుత్ రీడింగ్‌ను నమోదు చేసుకున్నారు. 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను వినియోగించిన వినియోగదారులకు జీరో బిల్లులను అందజేశారు. వినియోగదారులు వాడిన కరెంటు యూనిట్లు, బిల్లులో మినహాయించిన సబ్సిడీని నమోదు చేసి జీరో బిల్లును వినియోగదారులకు అందించారు.

వాహనంలో పెట్రోలు, డీజిల్ కొట్టించుకునే క్రమంలో కొన్ని బంకుల్లో వాహనదారులను బురిడీ కొట్టిస్తున్న ఘటనలు అడపాదడపా వెలుగులోకి వస్తూనే ఉన్నాయి! మరి.. బంకు యజమానులే బురిడీతో దెబ్బ యిపోతే? ట్యాంకర్ల యజమానులే ఆ పని చేస్తున్నారు. ఏ మాత్రం అనుమానం రాకుండా నిర్ణీత కొలతల కన్నా తక్కువ ఇంధనాన్ని బంకుల్లో ఖాళీ చేసి 500 లీటర్ల దాకా ట్యాంకర్‌లోనే మిగిల్చుకుంటున్నారు! పైకి మాత్రం బంకుల్లో ఇంధనాన్ని బొట్టు లేకుండా ఖాళీ చేస్తున్నట్లు కనిపించినా లోపల కొంత మిగిలే ఉంటోంది. ఇదంతా ఆ ట్యాంకర్‌లో కొంత మేర ఇంధనాన్ని దాచేందుకు గుట్టుగా ఏర్పాటు చేసిన 'బేబీ ట్యాంకర్' మహిమే!



ట్యాంకర్‌లో బయట పడిన బేబీ ట్యాంకర్

బంకులను ముంచే బేబీ ట్యాంకర్!

నాలుగు ట్యాంకర్లలో 'బేబీ ట్యాంకర్లు'!



ఇటీవల ఎస్ఆర్ బంకుల నిర్వాహకులు జిల్లా తూనికలు కొలతల శాఖకు ఫిర్యాదు చేశారు. దీంతో తాము తనిఖీలు చేస్తే ట్యాంకర్లలో బేబీ ట్యాంకర్ల వ్యవహారం బయటపడింది. ఇప్పటికే బేబీ ట్యాంకర్లున్న నాలుగు ట్యాంకర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశాం. హెచ్‌పీసీఎల్ సంస్థలో ఫ్లోమీటర్ నుంచి వస్తున్న ఇంధనాన్ని ట్యాంకర్లలో నింపిన తర్వాత డిప్‌రాడ్ ద్వారా తిరిగి కొలత సరిచూసిన తర్వాతనే ట్యాంకర్లను బయటకు పంపాలి. ఇలా చేయకపోవడంతోనే అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించాం, దీనిపై నిఘా మరింత పెంచి తగు చర్యలు తీసుకుంటాం.

-పల్నాటి సత్యనారాయణ, తూనికలు కొలతల శాఖ అధికారి, మేడ్చల్ జిల్లా

పెట్రోల్, డీజిల్ ట్యాంకర్ యజమానుల ఘరానా మోసం



- పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లలో గుట్టుగా బేబీ ట్యాంకర్ ఏర్పాటు
- దాంట్లో 500 లీటర్ల ఇంధనం
- 16వేల లీటర్లు పట్టే ట్యాంకర్‌లో ఈలోటు గుర్తించరనే ధీమా
- ట్రిప్పునకు 500 లీటర్ల దాకా చోరీ.. అదంతా బ్లాకులో విక్రయం
- తూనికలు-కొలతల శాఖకు పెట్రోల్ బంకు యజమానుల ఫిర్యాదు
- తనిఖీల్లో గుట్టు రట్టు.. నాలుగు ట్యాంకర్లలో బేబీ ట్యాంకర్ల గుర్తింపు..సీజ్

ఘట్‌కేసర్, మార్చి 1: రాష్ట్రంలో ఇంధనం సరఫరా చేసే అతిపెద్ద కేంద్రం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ సమీపంలోని హెచ్‌పీసీఎల్. ఈ సంస్థ అధికారుల నిర్లక్ష్యంతో పెట్రోల్ ట్యాంకర్ల యజమానులు ఘరానా మోసానికి పాల్పడుతున్నారు. బంకుల యాజమాన్యాలకు నష్టం జరిగితే మాకేంటి తమ జేబులు నిండితే చాలు.. అన్న చందంగా వ్యవహరిస్తున్నారు హెచ్‌పీసీఎల్ అధికారులు. పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే ట్యాంకర్‌లో మూడు, నాలుగు చాంబర్లు (గదులు) ఉంటాయి. ఒక్కో చాంబర్‌లో 4వేల నుంచి 5వేల లీటర్ల దాకా ఇంధనం పడుతుంది. బంకుల్లో ఖాళీ చేసేటప్పుడు మాత్రం మూడు చాంబర్లలోని ఇంధనమంతా ఖాళీ అవుతుంది. నాలుగో చాంబర్లో మాత్రం గుట్టుగా 'బేబీ ట్యాంకర్' అమర్చి ఉండటంతో ఆ చాంబర్‌ను ఖాళీ చేసినా 500 లీటర్ల దాకా లోపలే ఉండిపోతుంది. ఒక ట్యాంకర్‌లోంచి 12వేల లీటర్ల నుంచి 16వేల లీటర్ల దాకా ఇంధనం ఖాళీ చేస్తుండటంతో 500 లీటర్ల మేర తక్కువగా వస్తే దాన్ని గుర్తించడం అంత తేలిక కాదు. అయితే రాష్ట్రంలోనే అతిపెద్ద ఇంధన సరఫరా కేంద్రం అయిన హెచ్‌పీసీఎల్ సంస్థ నిర్లక్ష్యం, అక్కడి అధికారుల చేతివాటంతోనే ఈ దోపిడీ మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మార్గ మధ్యలో కల్తీకిగానీ, చౌర్యానికి గానీ అవకాశం లేకుండా చూసుకొని డిపో నుంచి నాణ్యమైన ఇంధనాన్ని బంకులకు చేరవేయాల్సిన బాధ్యత హెచ్‌పీసీఎల్ సంస్థదే. డిపోలో లోడ్ అవుతున్న ప్రతి ట్యాంకర్‌ను డిప్ వేసి పరిశీలించాకే ట్యాంకర్లను బయటకు పంపాలి. అయితే మామూళ్ల మత్తులో కొందరు అధికారులు ఇవేమీ పరిశీలించకుండానే ట్యాంకర్లను బయటకు పంపుతున్నారని, ఫలితంగా బేబీ ట్యాంకర్ల ద్వారా ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్లు అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై హెచ్‌పీసీఎల్‌సంస్థ డిపో మేనేజర్‌ను సంప్రదించగా అలాందేమీ లేదని దాటవేశారు. హెచ్‌పీసీఎల్ నుంచి రాష్ట్రంలోని వివిధ పెట్రోల్ బంకులకు నిత్యం 300 నుంచి 400 ట్యాంకర్ల ద్వారా పెట్రోల్, డీజిల్ సరఫరా అవుతుండటంతో 'బేబీ ట్యాంకర్ల' ద్వారా ట్యాంకర్ల యజమానులు కోట్లలో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇంధన విక్రయాల లెక్కల ద్వారా పెట్రోలు, డీజిల్ తరుగు వస్తుండటంతో అనుమానించిన బంకుయజమానులు తూనికలు-కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో ఈ గుట్టు రట్టయింది.

బయటపడిందిలా..

పెట్రోల్, డీజిల్ తక్కువగా వస్తుండటంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని బంకుల యజమానుల్లో కొందరు ఇటీవల జిల్లా తూనికలు కొలతల అధికారులను ఆశ్రయించారు. ఘట్‌కేసర్‌లో సమీపంలోని హెచ్‌పీసీఎల్ సంస్థలోని గ్యాన్త్రీ ప్రక్రియను ఆ జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పల్నాటి సత్యనారాయణ తన బృందంతో తనిఖీ చేశారు. పెద్ద ట్యాంకర్ లోపల చాంబర్లతో పాటు.. బేబీ ట్యాంకర్ ఉండటంతో అధికారులు షాకయ్యారు. ఈ బేబీ ట్యాంకర్‌లో నిండిన దాదాపు 500 లీటర్ల పెట్రోల్, డీజిల్‌ను దర్జాగా బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. బేబీ ట్యాంకర్‌లో దాచిన పెట్రోల్‌ను ఘనాపూర్ వద్ద అవుటర్ సర్వీస్ రోడ్‌లో ఖాళీచేస్తున్న సమయంలో ఎస్‌వోటీ పోలీసుల బృందం దాడి చేసి ట్యాంకర్‌ను సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులకు అరెస్టు చేసింది. ఈ మేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక ఈ ఘరానా మోసం గురించి తెలుసుకున్న పెట్రోల్ బంకుల యజమానులు అప్రమత్తమయ్యారు. తమ పెట్రోల్ బంకులకు సరఫరా అవుతున్న పెట్రోల్, డీజిల్ పరిమాణంపై ప్రత్యేక నిఘా పెట్టాలని తమ సిబ్బందికి యజమానులు సూచనలు చేశారు. లోడ్ వచ్చిన ప్రతిసారి క్రయ విక్రయాలను నిలిపివేసి ఇంధన ట్యాంకర్‌ను ఖాళీ చేసుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు.

పత్తి రైతుకు.. ఉత్తి చేతులు!

కొనుగోలు చేశారు.. డబ్బులు మరిచారు

- » పత్తి విక్రయించి రెండు నెలల గడిచినా ఖాతాలో పడని డబ్బులు
- » సీసీఐ, మార్కెట్ కార్యాలయాల చుట్టూ పత్తి రైతుల ప్రదక్షిణలు
- » ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ఆందోళన
- » పరిగి మార్కెట్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన



పరిగి, మార్చి 1: ఆరుగాలం కష్టించి పంట పండించడం ఒక ఎత్తయితే.... పండించిన పంటను విక్రయించుకోవడం మరోఎత్తుగా మారింది పత్తిరైతుల పరిస్థితి. ఇటీవల ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేసింది. వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పిన సర్కారు రెండు నెలలైనా పత్తి రైతుల ఖాతాల్లో డబ్బులు వేయలేదు. దీంతో వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పత్తిని అమ్ముకుని నెలల గడిచినా ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడుల కోసం అప్పులు చేసి పండించిన పత్తిని విక్రయించిన తర్వాత కూడా డబ్బుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. సీసీఐ, మార్కెట్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, కోట్‌పల్లి, మర్పల్లి ప్రాంతాల్లో మొత్తం 14కాటన్ మిల్లుల్లో పత్తిని కొనుగోలు చేశారు. ప్రభుత్వం ఏగ్రేడ్ పత్తి క్వింటాల్‌కు రూ.7,020 గ్రేడ్ రూ.6,970 ధర నిర్ణయించి కొనుగోలు చేసింది. జిల్లాలోని 18 మండలాల్లో ఈసారి 2,61,009 ఎకరాల విస్తీర్ణంలో పత్తినిసాగు చేసిన సంగతి విదితమే. పత్తి సాగుకు అన్ని రకాలుగా అనుకూలిస్తే ఎకరాకు 12 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఈసారి ఎకరాకు ఆరు క్వింటాళ్లలో లోపే వచ్చిందని అంచనా. అయితే జిల్లాలో దాదాపుగా 18 లక్షల క్వింటాళ్లకుపైగా పత్తి దిగుబడి వస్తుందని అంచనా. జిల్లాలో సీసీఐ ద్వారా 35,470 మంది రైతుల నుంచి 8.17లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ప్రైవేట్ మార్కెట్ల ద్వారా మరో 4.6 లక్షల క్వింటాళ్ల కొనుగోళ్ల జరిగాయి. మరో ఐదారు లక్షల క్వింటాళ్ల పత్తిని జీరో కింద ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించారు. సీసీఐ ద్వారా ఇప్పటి వరకూ రూ.560 కోట్లు రైతులకు చెల్లించింది. ఇంకా దాదాపుగా రూ.30కోట్ల వరకు చెల్లింపులు జరగాలి. సీసీఐకి అమ్ముకున్న పత్తి రైతులకు నెలల తరబడి డబ్బులు రాకపోవడంతో కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. జిల్లాలో ఇరవై శాతం అంటే నాలుగు నుంచి ఐదు వేల మంది రైతుల ఖాతాల్లో డబ్బులు పడక ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం పత్తి విక్రయించిన రైతులు డబ్బుల కోసం పరిగి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మార్కెట్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఖాతాల్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని పత్తి రైతులు కోరుతున్నారు.

డిసెంబరులో పత్తి అమ్మిన డబ్బులు రాలే..



61 క్వింటాళ్ల పత్తిని డిసెంబరు నెలలో సీసీఐకి విక్రయించా. ఇప్పటి వరకూ డబ్బులు ఖాతాలోపడలేదు. అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. పంట పెట్టుబడులకు తెచ్చిన డబ్బులకు మిత్తి పెరిగి మోపెడవుతుంది. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

-నర్సింహులు, రైతు, రంగాపూర్

ఖాతాల్లో డబ్బులు పడేలా చర్యలు



సాంకేతిక సమస్యతో పత్తి రైతుల ఖాతాల్లో డబ్బులు పడకపోవచ్చు. డబ్బుల ప్రక్రియ సీసీఐ అధికారులు చూస్తారు. అయినా డబ్బులు పడని పత్తి రైతుల విషయమై సీసీఐ దృష్టికి తీసుకెళ్తాం . డబ్బులు పడని రైతులు మార్కెట్ కార్యాలయాల్లో సంప్రదించాలి.

-సారంగపాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి

ఎవరికి చెప్పుకోవాలి




50 క్వింటాళ్ల పత్తిని సీసీఐకి విక్రయించి రెండు నెలలయింది. వారం రోజుల్లో డబ్బులు పడతాయని చెప్పారు. కానీ ఇప్పటి వరకూ ఖాతాలో జమ కాలేదు. పరిగి మార్కెట్ ఆఫీస్‌కు వెళ్లి అడిగితే ఎప్పుడు ఖాతాలో పడితే అప్పుడే తీసుకోవాలని వింత సమాధానం ఇస్తున్నారు. పత్తి డబ్బులు ఇప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

-ఎక్బాల్, రైతు, ఇబ్రహీంపూర్

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి
ప్రత్యేక బృందాలు

- » క్షేత్ర స్థాయిలో విచారణ అనంతరం పరిష్కారంపై నిర్ణయం
- » జిల్లాలో 12 వేల దరఖాస్తులకు మోక్షం లభించే అవకాశం



వికారాబాద్, మార్చి1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. పెండింగ్ దరఖాస్తులపరిష్కారం కోసం ప్రతి మండలానికి రెండు నుంచి మూడు ప్రత్యేక బృందాలను నియమించారు. పెండెన్సీ ఎక్కువగా ఉన్న మండలాల్లో మూడు, తక్కువగా ఉన్న మండలాల్లో రెండు బృందాలను ఏర్పాటు చేశారు. మండలాల్లో తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో ఏర్పాటైన బృందాలు ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించాయి. జిల్లాలో 20మండలాలు ఉన్నాయి. ప్రత్యేక బృందాలు ధరణి పెండింగ్ దరఖాస్తులపై శుక్రవారం నుంచి డెస్క్ వర్క్ ప్రారంభించాయి. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రారంభమైన పరిశీలన ప్రక్రియ ఈనెల 9వ తేదీ వరకు కొనసాగనుంది.

12 వేల దరఖాస్తుల పెండింగ్

ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 12 వేల ధరణి దరఖాస్తులకు మోక్షం కలగనుంది. పాసు పుస్తకాల్లో పేర్లు తప్పుగా నమోదు కావడం, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు నమోదవడం, పట్టా భూములు ఉన్నా నిషేధిత జాబితాల్లో నమోదు కావడం, సర్వే నెంబర్లు మిస్సింగ్ వంటి సమస్యలకు పరిష్కారం లభించనుంది. ధరణి దరఖాస్తులను మొదట పరిశీలించి అవసరమైన డాక్యుమెంట్లు, ఆధారాలు ఉన్నాయా అనేది ధ్రువీకరించుకోనున్నారు. ఆ తరువాత క్షేత్ర స్థాయిలోనూ విచారణ నిర్వహిస్తారు. దరఖాస్తుదారుల వద్ద ఉన్న ఆధారాలను కూడా పరిశీలిస్తారు. సమస్య ఉన్న వ్యవసాయ భూములను వారు పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోనున్నారు.

ఎన్నికల సమయంలో పెరిగిన పెండెన్సీ..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో రెవెన్యూ యంత్రాంగం రెండు, మూడు నెలల పాటు బిజీగా ఉండడంతో ధరణి దరఖాస్తుల పరిష్కారంపై దృష్టిసారించలేకపోయింది. ఏమాత్రం సమయం లభించినా.. ఈ దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్న విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా ధరణి దరఖాస్తుల పెండెన్సీని తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఇంటర్ ఇంగ్లీష్ పరీక్షకు 317 మంది గైర్హాజరు

వికారాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు జిల్లాలో 317మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం నిర్వహించిన పరీక్షకు 8565 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 8248మంది హాజరయ్యారు. 317మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 6872మంది విద్యార్థులకు 6655 మంది హాజరు కాగా, 217మంది హాజరు కాలేదు. ఒకేషనల్ విభాగంలో 1693మంది విద్యార్థులకు 1593 మంది హాజరు కాగా 100 మంది గైర్హాజరయ్యారు.

కులకచర్ల: మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష జరిగింది. రామలింగేశ్వర కళాశాలలో 285 మంది విద్యార్థులకు గాను 16 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ కామేశ్వరి తెలిపారు.

వేసవిలో ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

మోమిన్‌పేట్, మార్చి 1: వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధిహామీ కూలీలు జాగ్రత్తలు పాటించాలని డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెల్చాల్ గ్రామంలో శుక్రవారం జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీలో పని చేసే కూలీలకు రూ.272 పొందాలంటే నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. కూలీలు నష్టపోకుండా ప్రతీ ఒక్కరికి ప్రతీవారం డబ్బులు అందించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలకు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం నీరు పోయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శంకరయ్య, ఏపీయం రాజు, ఈసీ వికాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్‌లు గంగయ్య, వెంకటేశం, రాములు, ఎల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ హన్మంతు, కూలీలు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

కులకచర్ల, మార్చి 1: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారులు వాజిహుద్దీన్, మాధురి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం వైద్య సిబ్బంది, ఆశావర్కర్‌లు, అంగన్‌వాడీ టీచర్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 4, 5 తేదీల్లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

తాండూరు రూరల్/పరిగి: పల్స్‌పోలియోను విజయవంతం చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రవీంద్ర యాదవ్ కోరారు. తాండూరులో మొత్తం 41,979 మంది పిల్లలు ఉన్నారని తెలిపారు. పరిగిలో 6434 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నట వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

'ధరణి' సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలి



రెడ్డిఘణాపూర్‌లో ధరణి సమస్యలపై దరఖాస్తు తీసుకుంటున్న అధికారులు

బషీరాబాద్, మార్చి 1: ధరణి సమస్యలు ఎమైనా ఉంటే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని బషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటయ్య సూచించారు. రెడ్డిఘణాపూర్‌లో శుక్రవారం ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీటీ అక్కడికి వచ్చిన రైతులకు ధరణి సమస్యలకు సంబంధించి ఏఏ అంశాలపై దరఖాస్తు చేసుకోవాలనేదానిపై వివరించారు. పలు సమస్యలపై దరఖాస్తులు రాగా అధికారులు స్వీకరించారు. త్వరలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, సర్వేయర్ ప్రభు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో ఉమ్మడి జిల్లా అధోగతి పాలు

- సాగునీటి ప్రాజెక్టుల్లో తీరని అన్యాయం
- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పరిగి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ సునీత, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పరిగి, మార్చి 1 : కేసీఆర్ పదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాను అధోగతి పాలు చేశారని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం పరిగిలోని ఆయన నివాసంలో జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే 43 శాతం జనాభా ఉందని, రాష్ట్రానికే గుండెకాయలాంటి ఉమ్మడి జిల్లాకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఇక్కడ వచ్చే ఆదాయంతో ఉత్తర తెలంగాణలో ప్రాజెక్టులు కట్టారని, అభివృద్ధి పనులు చేశారని ఆరోపించారు. ఆదాయ వనరుగా ఉన్న జిల్లాను ఏడారిగా మార్చారని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పాలమూరు-రంగారెడ్డి, చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టుల ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు రూపకల్పన చేసి పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో డిజైన్లు మార్చేశారని, చేవెళ్ల-ప్రాణహితను మెదక్ జిల్లాకు మళ్లించారని, పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్ట్ ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. మేడిగడ్డ, ఇతర ప్రాజెక్టులు కూలిపోతున్నాయని, దీనికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రూ.7లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కేపీ లక్ష్మీదేవిపల్లి వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ నిర్మించి పరిగికి సాగునీరు తెస్తామని తెలిపారు. పరిగికి రెల్వేలైను నిర్మాణానికి రూ.3100 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఆరుగ్యారంటీ పథకాలు చేస్తామని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, రూ.10లక్షల వరకు ఆరోగ్యశ్రీ సేవలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలు అమలుచేసినట్లు తెలిపారు. ఉచిత విద్యుత్‌కు 98 శాతం మంది అర్హులుగా ఉన్నారని, దశలవారీగా మిగతా గ్యారంటీలను అమలు చేయడం జరుగుందన్నారు. గ్రామాల్లో త్వరలోనే ఐదుగురి సభ్యులతో ఇందిరమ్మ కమిటీలు వేసి ప్రభుత్వ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఇమడలేకనే కాంగ్రెస్‌లో చేరామని తెలిపారు. బీఆర్ఎస్‌లో కార్యకర్తలకు కనీస మర్యాద లేదని, నియంతపాలన కొనసాగిందని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉంటుందని, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ద్వారా జిల్లాకు సాగునీరు అందిస్తామని తెలిపారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కొరకు సాధించుకున్న రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సాధించింది శూన్యమని విమర్శించారు. గడీలపాలన పోయిందని, ప్రజాపాలన వచ్చిందని తెలిపారు. కాళేశ్వరం, మేడిగడ్డల పేరుతో రూ.వేల కోట్లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. తప్పులను ఒప్పుకోవాల్సిందిపోయి బీఆర్ఎస్ నేతలు నీతులు మాట్లాడతారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను పాలమూరు నుంచి పార్లమెంట్‌కు పంపిస్తే జిల్లాకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో జిల్లాను సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం బ్లాక్ వన్, టు అధ్యక్షులు సిద్ధాంతి పార్థసారథి, భరత్, డీసీసీ ఉపాధ్యక్షుడు బి.భీంరెడ్డి, కార్యదర్శులు రఘువీరారెడ్డి, కె.హన్మంత్, పట్టణాధ్యక్షుడు ఇ.కృష్ణ, కులకచర్ల ప్యాక్స్ చైర్మన్ మొగులయ్య, కొమిరె రాంచంద్రయ్య, పాలాది శ్రీనివాస్, జె.అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దగాపడ్డ దక్షిణ తెలంగాణ : వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ : పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దక్షిణ తెలంగాణను దగా చేశారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ధ్వజమెత్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తానని హామీ ఇచ్చి.. ఎంపీగా గెలుపొందిన తర్వాత పాలమూరు ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని కేసీఆర్‌పై మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం పనులు 80 శాతం పూర్తయ్యాయన్న బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలతో.. శుక్రవారం 'చలో పాలమూరు' నినాదంతో ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన తరలివెళ్లారు. అంతకుముందు షాద్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వీర్లపల్లి మాట్లాడుతూ కేసీఆర్ దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చి, ఉత్తర తెలంగాణ అభివృద్ధిపైనే దృష్టి సారించారని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను కేసీఆర్ తన కుటుంబానికి తాకట్టుపెట్టి ప్రజల బతుకులను దుర్భరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్ బాటలోనే మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కూడా మాజీ సీఎం కేసీఆర్ బాటలోనే నడిచారని శంకర్ విమర్శించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం గురించి ఎప్పుడూ పట్టించుకోలేదన్నారు. గతంలో ఎమ్మెల్యే హోదాలో ఉన్న అంజయ్య యాదవ్ రిజర్వాయర్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఉంటే పనులు ప్రారంభమై సాగు, తాగునీటి కష్టాలు తీరేవన్నారు. అభివృద్ధి పనులపై ప్రశ్నిస్తే కేసులు పెట్టి భయాందోళనకు గురిచేశారని ఆరోపించారు. మిషన్‌భగీరథ పథకంపై అసెంబ్లీలో ప్రస్తావించానని, త్వరలోనే ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించనున్నారని వీర్లపల్లి తెలిపారు.



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సందర్శనకు నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

'డీఎల్'గా బీట్ ఆఫీసర్

- డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి అటవీ అధికారి ఎంపిక
- గ్రూప్-4 ఫలితాల్లోనూ అర్హత



సీహెచ్ నరేష్

ధారూరు, మార్చి 1: ధారూరు అటవీ రేంజ్‌లో బీట్ అధికారిగా పనిచేస్తున్న సీహెచ్ నరేష్.. ఇటీవల తెలంగాణ గురుకుల బోర్డు నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించి గురుకుల డిగ్రీ లెక్చరర్(డీఎల్) ఉద్యోగానికి ఎంపికయ్యారు. గ్రూప్-4 పరీక్ష ఫలితాల్లోనూ మెరిట్ సాధించారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం రావులపల్లికి చెందిన నరేష్ ఎమ్మెస్సీ(మ్యాథ్స్) విద్యార్హతతో జూలై 2019లో అటవీ బీట్ అధికారిగా ఉద్యోగం సంపాదించి ధారూరు రేంజ్‌లో పోస్టింగ్ పొందారు. గతేడాది ఆగస్టులో తెలంగాణ గురుకుల బోర్డు నిర్వహించిన.. డిగ్రీ లెక్చరర్(డీఎల్) పరీక్ష రాసి అర్హత సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈనెల 4న సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఆయన ఉద్యోగ నియామకపత్రం అందుకోనున్నారు. డీఎల్ ఉద్యోగానికి ఎంపికవడం సంతోషంగా ఉందని బీట్ అధికారి నరేష్ తెలిపారు. గ్రూప్-4 ఉద్యోగం కూడా వచ్చే అవకాశాలున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ధారూరు డీఎఫ్ఆర్వో జగన్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రాజేందర్‌రెడ్డి, బీట్ ఆఫీసర్ ఆనంద్, అటవీ సిబ్బంది, తదితరులు నరేష్‌కు అభినందనలు తెలిపారు.

ఇంటిపన్ను వందశాతం వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీవో సాధన

కందుకూరు, మార్చి 1 : 2023-24 సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని డీఎల్పీవో సాధన పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో సరితతో కలిసి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో జీపీడీపీ, ఉపాధిహామీ పనులు, నర్సరీల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీవో సునీల్, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

అక్రమ మైనింగ్ నిర్వాహకులపై చర్యలు



అంకిరెడ్డిపల్లిలో మైనింగ్ నిర్వహిస్తున్న ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అశోక్

కీసర, మార్చి1: అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని కీసర తహసీల్దార్ అశోక్ హెచ్చరించారు. మండల పరిధి అంకిరెడ్డిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 918, 887, 886లో అనుమతికి మించి మైనింగ్ నిర్వహిస్తున్న స్థలాన్ని శుక్రవారం తహసీల్దార్ అశోక్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ మాట్లాడుతూ 35 ఫీట్ల అనుమతి పొంది, దాదాపు 100 ఫీట్ల వరకు డ్రిల్ వేసి అక్రమంగా మైనింగ్ నిర్వహించారని అశోక్ తెలిపారు. దీంతో పక్కన ఉన్న అంకిరెడ్డిపల్లి గ్రామానికి హాని జరిగే అవకాశం ఉంది. దీంతో పాటు మైనింగ్ నిర్వహిస్తున్న ప్రదేశం దాదాపు 324 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఉందని, స్థలానికి మేడ్చల్, మాల్కాజ్‌గిరి జిల్లా యాదాద్రి భువనగిరి జిల్లా, సరిహద్దు వివాదం కూడా ఉందని తెలిపారు. కావున స్థలంపై సమగ్ర విచారణ జరిపి, నివేదికను ఉన్నత అధికారులకు తెలియజేస్తామని తహసీల్దార్ అశోక్ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం

బషీరాబాద్, మార్చి 1: మండలంలోని కొర్విచెడ్‌మని గ్రామంలో తాగునీటి సమస్య తీరింది. వేసవి వేళ డైరెక్టు పంపింగ్ సిస్టం బోరు పనిచేయకపోవడంతో స్థానికులు నీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. విషయం తెలుసుకున్న ఎంపీపీ కరుణఅజయ్‌ప్రసాద్ తాజామాజీ సర్పంచ్ రథోడ్ సునీతా, కార్యదర్శి రాజుతో మట్లాడి బోరు మరమ్మతులు చేయించారు. ఎంపీపీ చొరవతో కొత్తగా మోటర్, ఇతర సామగ్రి తెప్పించి శుక్రవారం బోరును వాడుకలోకి తీసుకువచ్చారు. దీంతో స్థానికంగా నీటి సమస్య తీరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పనులను ఎంపీపీ భర్త, పీఎసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, తాజామాజీ సర్పంచ్ రథోడ్‌సునీతా దగ్గరుండి పరిశీలించారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

ధారూరు, మార్చి 1: కుక్కింద ఉన్నత పాఠశాలలో శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని సాయి దంత కళాశాల వారు దంత వైద్యశిబిరం నిర్వహించారు. 240 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేసి చికిత్స చేశారు. తీవ్రమైన దంత సమస్యలున్న విద్యార్థులను గుర్తించి పూర్తిస్థాయి చికిత్స నిమిత్తం తమ దంత వైద్యశాలకు రావాలని సూచించారు. దంత వైద్యులు అబ్దుల్‌వాసే, డి.జగదీష్, సోనాలి, అనూష, శివప్రియ, ప్రత్యూష, పీఆర్వో రవీందర్, పాఠశాల హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధునిక సేద్యం లాభదాయకం

తలకొండపల్లి, మార్చి 1 : ఆధునిక పద్ధతులతో సేద్యం చేయడం రైతులకు అన్ని విధాల లాభదాయకమని తలకొండపల్లి మండల వ్యవసాయాధికారి రాజు అన్నారు. పంటల సాగులో రైతులు పెట్టుబడులు తగ్గించుకొని అధిక దిగుబడులు పొందే విధానంపై దృష్టి సారించాలని చెప్పారు. తలకొండపల్లి మండలంలోని పడకల్, వెల్జాల గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి వరి పంటను, గోదాముల్లో యూరియా నిల్వలను పరిశీలించారు. పడకల్, అంతారం, వెంకటాపూర్ గ్రామాల్లో వరి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణాధికారులు విజయ్, అనిత, శిరీషలతో పాటు బాలయ్య, మహేష్, రైతులున్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో రాజు

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి

- రాచకొండ షీటీం డీసీపీ ఉషా విశ్వనాథం



మాట్లాడుతున్న డీసీపీ ఉషా విశ్వనాథం

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 1 : అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని రాచకొండ షీటీం డీసీపీ ఉషావిశ్వనాథం తెలిపారు. అంకుషాపూర్ ప్రిన్స్‌టన్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(ఇబ్రహీంపట్నం)లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో డీసీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ దాడుల పట్ల తమను తాము రక్షించుకోవడానికి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు కెరీర్‌పై దృష్టి సారించాలని, ఫోన్ల వాడకం తగ్గించి పుస్తక పఠనం చేయాలన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని తెలిపారు. ప్రిన్సిపాళ్లు రాధిక, వెంకటేశ్వర్లు, రాచకొండ సెక్యూరిటీ ఫోరం కో-ఆర్డినేటర్లు అర్చన, నందిత, సావిత్రి, సభ్యులు రజిని, రాధిక, స్వర్ణ, నిఖత్, వైఎస్ ప్రిన్సిపాల్ సౌజన్య, అధ్యాపకులు వరలక్ష్మి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 1 : అర్హులందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీన్ తెలిపారు. మండలంలోని అవుషాపూర్‌లో శనివారం ఓటుహక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 'నా ఓటు-నా దేశం కోసం' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరుల్గున్నారు.

గ్రామీణ విద్యార్థులకు 'కార్పొరేట్ విద్య' అందుబాటులో ఉండాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ భూపాల్

కందుకూరు, మార్చి 1 : కార్పొరేట్ స్థాయి విద్య గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూడాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని నోబుల్ స్కూల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మండల విద్యాధికారి టి.మనోహర్, హైకోర్టు సీనియర్ అడ్వకేట్లు వెంకటాచారి, బి.జగన్ మోహన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ బి.కొండల్‌రెడ్డి, తదితరులున్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దు : సీఐ



రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

వికారాబాద్, మార్చి 1: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ నాగరాజు తెలిపారు. వికారాబాద్ పోలీస్ స్టేషన్‌పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్స్ చెడుప్రవర్తనను మార్చుకొని సత్ప్రవర్తనతో నడుచుకోవాలన్నారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, కబ్జాలకు పాల్పడినా కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. చట్ట వ్యతిరేక పనులు చేస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. రౌడీ షీటర్స్ నేరాల సంబంధిత కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా తమ భవిష్యత్తు ను నాశనం చేసుకోవద్దని వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక, చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. రౌడీ షీటర్స్ ఎవరినైనా ఇబ్బంది పెట్టినట్టు పిర్యాదు అందితే చర్యలు తీవ్రంగా ఉంటాయని, రౌడీ షీటర్స్ కదలికలపైన పోలీస్ అధికారుల నిఘా ఉందనే విషయాన్నీ గుర్తించుకోవాలన్నారు. రాత్రి సమయం లో పెట్రో, బ్ల్యూ కోట్స్ పోలీస్ అధికారుల ద్వారా రౌడీ షీటర్స్ నివసించే ప్రాంతాలలో నిఘా పెట్టడం జరుగుతుందని అన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలి



కమిషనర్ వసంతకు వినతిపత్రం అందజేస్తున్న మజీద్ కమిటీ సభ్యులు

ఆమనగల్లు, మార్చి 1 : పట్టణంలోని వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని స్థానిక జామ మజీదు కమిటీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆ మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండి. మాసూమ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ లలిత, ఎస్సై బాల్‌రామ్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ వసంతకు వినతిపత్రాలు అందజేశారు. ఆమనగల్లు పట్టణంలో వక్ఫ్‌బోర్డుకు రూ.కోట్ల విలువ చేసే రెండెకరాల భూమి ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు అట్టి భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. గతంలో కూడా ఆక్రమించే ప్రయత్నం చేయగా అప్పట్లో అధికారులకు ఫిర్యాదు చేస్తే వాటిని తొలగించారని చెప్పారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల రక్షణ కోసం ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. వివిధ మజీద్ కమిటీల అధ్యక్షులు గౌస్‌మైనోద్దీన్, ఖాదర్ ఖాద్రీ, మాసూమ్, నాయకులు చోటేబేగ్, నూరోద్దీన్, రజాక్, జబ్బార్, నయీమ్, అఫ్జల్, చాంద్‌పాష, జలాల్, అజహార్, మజీద్, హమీద్, పాష, రాహూఫ్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా ధరణి సమస్యల పరిష్కారం

- మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



భూసమస్యలపై స్పెషల్ డ్రైవ్‌ను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట, మార్చి 1 : పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హాజరై పరిశీలించి మాట్లాడారు. ఈనెల 1 నుంచి 10వ తేదీ వరకు పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను సత్వరమే పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ మాట్లాడుతూ శామీర్‌పేట మండలంలో పెండింగ్‌లో 1,756 ధరణి భూసమస్యల పరిష్కారానికి సంబంధించి దరఖాస్తులు ఉన్నట్లు తెలిపారు. మూడు టీంలను ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్ కింద భూ సమస్యలపై యుద్ధప్రాతిపదికన చర్యలను తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్లియర్ చేస్తున్నట్లు చెప్పారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అయ్యసాగర్ త్రిపురాంతకేశ్వర ఆలయం ముస్తాబు

- 6 నుంచి 12వ తేదీ వరకు కొనసాగనున్న జాతర
- ఏర్పాట్లు పూర్తి.. 8న శివపార్వతుల కల్యాణం



అయ్యసాగర్ శివాలయం

ఆమనగల్లు, మార్చి 1: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దర్శనీయ స్థలంగా వెలుగొందుతున్న మండలంలోని రాంనుంతల గ్రామ సమీపంలో గల అయ్యసాగర క్షేత్రంలో వెలసిన శ్రీ త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి, భద్రకాళి, సరస్వతి, శ్రీరామాంజనేయ దేవాలయాలు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాయి. ఈనెల 6నుంచి 12వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని శోభాయామానంగా అలంకరించారు. శివకోటి జపయజ్ఞం, 26వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల కోసం ఆలయం వద్ద భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మేడ్చల్ తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివకోటి జపయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేసవి ప్రారంభం నేపథ్యంలో భక్తుల కోసం ఆలయ ఆవరణలో చలువ పందిర్లు, వసతి ఏర్పాట్లు గావించారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

బ్రహ్మోత్సవాల వివరాలను నిర్వాహకులు కర్ణాకర్‌రెడ్డి, ఆలయ వికాస సంఘం అధ్యక్షులు భట్టు నర్సిరెడ్డి, కార్యదర్శి ఎన్టీ పంచాక్షరిలు తెలిపారు. 6న విఘ్నేశ్వర పూజ, అభిషేకాలు, సర్వదేవతా పూజలు, అభిషేకాలు, భగవద్గీత పారాయణయాలు, దేవయజ్ఞం, మహాత్ముల ప్రవచనాలు, భజనలు, 7న శివకోటి యజ్ఞం, పూర్ణాహుతి, శివగీత, భగవద్గీత, పారాయణ, ప్రవచనాలు, 8న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రాత్రి 10 గంటలకు శివపార్వతుల కల్యాణం, రుద్రాభిషేకం, 9న అగ్నిగుండం, నందికోత్సవ సేవ, 10న భజనలు, చిన్నతేరు, నందీశ్వరసేవ, 11న పెద్ద తేరు, 12న చక్రతీర్థం, అమృత స్నానం, రుద్రాభిషేకం, మంగళహారతి కార్యక్రమాలుంటాయని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు రామరెడ్డి, వీరయ్య, యాదయ్య, యాదగిరి రెడ్డి, శ్రీనునాయక్, సరితపంతూ నాయక్, వైద్యనాథ్, చంద్రశేఖర్‌రెడ్డిలు కోరారు.

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి



పొలాలను పరిశీలిస్తున్న గోపాల్

కులకచర్ల, మార్చి 1: రైతులు సాగు చేసే పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ వికారాబాద్ జిల్లా అధికారి గోపాల్ తెలిపారు. మండలంలోని కుసుమ సముద్రం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. పంటలను వ్యవసాయశాఖ విస్తరణ అధికారి దగ్గర ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వీరస్వామి, రైతులు పాల్గొన్నారు.

పల్లె రోడ్లకు మహర్దశ

- మండలానికి రూ.3కోట్ల ఉపాధిహామీ నిధులు
- బషీరాబాద్ పరిధిలో ముమ్మరంగా పనులు



మాసన్‌పల్లిలో సాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు

బషీరాబాద్, మార్చి 1: మండలంలోని గ్రామాలు, గిరిజన తండాల అంతర్గత రోడ్లకు మహర్దశ పట్టుకుంది. ఉపాధిహామీ పథకం కింద రూ.3 కోట్ల నిధులు మంజూరు కావడంతో ఆయా గ్రామాల్లో పనులు ముమ్మరం చేశారు.పలు వార్డుల్లో అంతర్గత మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తున్నారు. గత కొన్నేళ్లుగా పల్లె ప్రజలు మట్టి రోడ్లతో రాత్రి వేళా, వర్షాకాలంలో బురదతో ఎన్నో ఇబ్బందులు పడేవారు.ఈ రోడ్ల అభివృద్ధికి బుయ్యని మనోహర్‌రెడ్డి నిధులు మంజూరు చేయించడంతో పలు గ్రామాల్లో శరవేగంగా పనులు కొనసాగుతున్నాయి. బషీరాబాద్ మేజర్ పంచాయతీకి రూ.40లక్షలు, మిగతా 35 పంచాయతీలకు గాను ఒక్కోదానికి రూ.5 నుంచి 10 లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయి.దీంతో మాసన్‌పల్లి, నీళ్లపల్లి, కంసాన్‌పల్లి(బి), బషీరాబాద్, మంతట్టి, అల్లాపూర్ తదితర గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం సనులు జోరందుకున్నాయి.ఈ రోడ్లను మార్చి 15 లోపు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ఈ క్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ, ఏఈలు సీసీ రోడ్ల నిర్మాణం పనులను సకాలంలో పూర్తి చేయించేందుకు చర్యలు చేపట్టారు. రోడ్లన్నీ సీసీ రోడ్లుగా మారుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బోరు చుట్టూ మురుగు.. గ్రామస్తుల ఇక్కట్లు

చౌదరిగూడ, మార్చి 1 : ప్రత్యేకాధికారుల నిర్లక్ష్యంతో లచ్చంపేటలో తాగునీటి బోరుచుట్టూ మురుగుతో పాటు నాచుతో కప్పబడి ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దాంతో గ్రామస్తులకు ఇబ్బందిగా మారింది. కాగా, సర్పంచుల పాలన ముగిసి 2నెలలు కావస్తున్నా పారిశుధ్యంపై దృష్టి సారించడంలేదనే విమర్శలున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం



అమరులకు జోహార్లు తెలుపుతున్న నాయకులు

పెద్దేముల్, మార్చి 1: మాదిగ అమరవీరుల సాక్షిగా ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ఎంఎస్పీ జిల్లా ప్రధానకార్యదర్శి స్వామిదాస్‌మాదిగ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాదిగ అమరవీరులను స్మరించుకున్నారు. అనంతరం స్వామిదాస్ మాదిగ మాట్లాడుతూ మాదిగ అమరుల త్యాగం ఊరికే పోదని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా పోరాటం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డబ్బుల నర్సింహులు, మంబాపురం రత్నప్ప పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్లకు దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్ టౌన్, మార్చి 1: సోలార్‌పద్ధతి ద్వారా విద్యుత్ అందజేయాలన్న ఉద్దేశంతో కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సోలార్ రూఫ్ టాప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పోస్టల్ అధికారి జి.సంపత్‌రెడ్డి కోరారు. ఇళ్లపై సోలార్ ప్లాంట్లు అమర్చుకోవడానికి రూ.1.80లక్షలు ఖర్చవుతుండగా ప్రభుత్వ సబ్సిడీ రూ.78వేలకే ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా నెలకు 300 యూనిట్ల విద్యుత్ లభిస్తుందని తెలిపారు.

అన్ని వార్డుల అభివృద్ధికి తగిన నిధులు



మేడ్చల్ టౌన్: సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు

మేడ్చల్ టౌన్, మార్చి 1: మున్సిపల్ పరిధిలోని అన్నివార్డుల అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయిస్తున్నట్లు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ వార్షిక బడ్జెట్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. 2023-2024 వార్షిక బడ్జెట్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఈసారి బడ్జెట్‌లో మున్సిపల్ పరిధిలోని 15వార్డుల్లో రూ.20.96లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల వినియోగంలో పక్షపాతానికి తావివ్వకుండా అన్నివార్డుల్లో పనులు చేపడుతామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచడంతో పాటు పారిశుధ్యం, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాలకు అత్యధిక నిధులు కేటాయించామన్నారు. ఇప్పటి వరకు మున్సిపల్ పరిధిలోని అన్నివార్డుల్లో సీసీ రోడ్డులు, అంతర్గత డ్రైనేజీ, వీధిదీపాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. వేసవి కాలం ఆరంభం కానుండటంతో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. దాదాపు అన్ని వార్డుల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్లు వేసి నీటి సరఫరా చేస్తున్నామన్నారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలో హరితహారం కింద నాటిన మొక్కలకు వేసవి కాలం ముగిసేంత వరకూ నీరందిచడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాములు, వైస్‌చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, బేరి బాల్‌రాజ్, అమరం హేమంత్‌రెడ్డి, వీణ, అమరం జైపాల్‌రెడ్డి, అమరం సరస్వతి, హంసారాణి, దేవేందర్, పెంటయ్య పాల్గొన్నారు.



ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

రూ.22.41కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

ఘట్‌కేసర్: అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని పోచారం మున్సిపాలిటీ పాలకవర్గం ఎకగ్రీవంగా తీర్మానించింది. మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ప్రత్యేక బడ్జెట్ సమావేశం జరిగింది. ఇందులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.22కోట్లు, 41లక్షల, 89వేల అంచనా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపాలిటీ శానిటేషన్ వాహనాలు, వాటి నిర్వాహణ, రైడింగ్ వాహనాలను కొనుగోలు చేయాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ సంతోష్‌కుమార్

తాండూరు రూరల్, మార్చి 1: గతనెల ఫిబ్రవరి 16వ తేదీన తాండూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుడి వద్ద రూ.49వేలు చోరీ చేసిన వారిని అరెస్ట్ చేసినట్లు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. కర్ణాటకలోని చించోళి ప్రాంతానికి చెందిన నారా నాగప్ప బస్సు ఎక్కుతుండగా ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన వానర్పె చంద్రయ్య, వానర్పె భద్రయ్యలు ఆయన వద్ద నుంచి రూ.49వేలు చోరీ చేసి పరారయ్యారు. ఈ విషయంపై నాగప్ప అప్పట్లో తాండూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శుక్రవారం తాండూరు బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న చంద్రయ్య, భద్రయ్యలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.18వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ సంతోష్ కుమార్, ఎస్ఐ కాశీనాథ్ ఉన్నారు. కేసు ఛేదించిన పోలీసులు అమ్జద్, శివా, షబ్బీర్, సాయప్పలను ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండలానికి చెందిన నాంపల్లి నరేశ్ గురువారం ఓ ఇంట్లో, బేకరీలో సెల్‌ఫోన్‌లు, నగదును చోరీ చేశాడు. ఈ ఘటనపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్ఐ శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో నిందితుడిని 24గంటల్లో పట్టుకొని శుక్రవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చోరీ కేసులో పట్టుబడిన నరేశ్‌ను కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

బాలికపై బాలుడి లైంగిక దాడి

పూడూరు, మార్చి 1: బాలికపై బాలుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు(16) గురువారం అదే గ్రామానికి చెందిన బాలిక(12) ఇంట్లో లేని సమయంలో లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైన్స్, ఎలక్ట్రికల్ షాపులో చోరీ



దొంగలు ధ్వంసం చేసిన వైన్‌షాప్ షట్టర్

మేడ్చల్ టౌన్, మార్చి 1: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబీల్‌పూర్‌లో వైన్స్, ఎలక్ట్రికల్ షాపులో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డబీల్‌పూర్ గ్రామంలో గురువారం రాత్రి దుండగులు స్థానికంగా ఉన్న తిరుమల వైన్ షాప్ షట్టర్‌ను ధ్వంసం చేసి ఆరు మద్యం బాటిళ్లు, సుమారు రూ.10వేల నగదును దొంగలించారు. అదేవిధంగా సమీపంలోని లక్ష్మీవేంకటేశ్వర ఎలక్ట్రికల్ షాపులో చొరబడి రూ.70వేల విలువ గల ఎలక్ట్రికల్ సామగ్రిని చోరీ చేశారు. వైన్స్ నిర్వాహకులు, ఎలక్ట్రికల్ షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఇంటి తాళం పగలగొట్టి..

దోమ: తిమ్మాయిపల్లి గ్రామ సమీపంలో కౌశిక్ పొలం దగ్గర నిర్మించుకున్న ఇంట్లో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. తాళాలు విరగొట్టి మూడు స్తంభాల విద్యుత్ తీగలు, ట్రాక్టర్ పరికరాలను చోరీ అయినట్లు కౌశిక్ తెలిపాడు. ఈ ఘటనపై శుక్రవారం దోమ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

తాండూరురూల్, మార్చి 1: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో తాండూరు సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నామాల అశోక్ ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు తాండూరు పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన గొల్లచెరువుకు చెందిన ముదిరాజ్ నరేందర్, నరేష్, ఇందిరానగర్‌కు చెందిన ఊషప్పలకు ఒక్కొక్కరికి రూ.1000ల జరిమానాలతోపాటు రెండు రోజుల జైలు శిక్ష విధించారని సీఐ వివరించారు.

అభివృద్ధి పనులపై చర్చలో గొడవ

● ఒకరిపై ఒకరు దాడికి దిగిన కాంగ్రెస్ కార్యకర్తలు

పెద్దేముల్, మార్చి 1: మండలంలోని తట్టెపల్లిలో అభివృద్ధి పనులపై చర్చజరుగుతుండగా గొడవ ఏర్పడింది. ఈ క్రమంలో కార్యకర్తల మధ్య గ్రూపు తగాదాలు బయటపడ్డాయి. ఒకరిపై ఒకరు దాడిచేసుకోవడంతో ఈ పంచాయితీ పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తట్టెపల్లికి ఉపాధిహామీ పథకం కింద పలు అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. వాటిని ఎవరెవరు కలిసి చేసుకుంటారనే విషయమై శుక్రవారం గ్రామంలో సమావేశమై చర్చించారు. ఈ క్రమంలో గొడవ మొదలైంది. గ్రూపులుగా విడిపోయిన కాంగ్రెస్ కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. ఈదాడిలో సాబేర్ అనే కార్యకర్తకు గాయాలయ్యాయి. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

యథా స్థానానికి మున్సిపాలిటీ నర్సరీ బోర్డు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఘట్‌కేసర్, మార్చి 1: గతనెల 28న ఆంధ్రజ్యోతిలో 'రాత్రికిరాత్రే మాయం' అంటూ ప్రచురితమైన కథనానికి అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 127లోని ప్రైమ్ ల్యాండ్‌లో మాయమైన మున్సిపాలిటీకి చెందిన నర్సరీ గేటును, కమాన్ (స్వాగతతోరణం)లను శుక్రవారం ఎట్టకేలకు కమిషనర్, చైర్‌పర్సన్ ముల్లి పావని, కౌన్సిలర్లు యథాస్థానంలో ఏర్పాటు చేశారు. ఘట్‌కేసర్‌లోని ప్రైమ్‌ల్యాండ్ వెంచర్‌లో 9560 చదరపు గజాల విస్తీర్ణంలో నర్సరీని ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.23లక్షల ఎల్ఆర్ఎస్ నిధులు వెచ్చించి నర్సరీని అభివృద్ధి చేసి 2020 సెప్టెంబరు 26 అప్పట్లో మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. ఉన్నట్టుండి ఇటీవల ఈస్థలం తనదని ఘట్‌కేసర్‌కు చెందిన కందకట్ల మాధవరెడ్డి మున్సిపాలిటీ గేటుకు నల్లరంగువేసి దానిపై ఈస్థలం తనదని పేరురాసి ఫోన్‌నెంబర్‌ను సైతం రాసుకున్న విషయం తెలిసిందే. దీంతో పాటు ఆయన కమాన్, శిలాఫలకంను అక్కడి మాయం చేశాడు. నాలుగు రోజులుగా మౌనం వహించిన కమిషనర్, చైర్‌పర్సన్‌లు శుక్రవారం కొంతమంది మంది కౌన్సిలర్లతో కలిసి శుక్రవారం ఎక్కడో దూరంలో ఉన్న కమాన్‌ను క్రేన్‌తో తీసుకు వచ్చి యథాస్థానంలో ఏర్పాటు చేశారు. వెంటనే గేటుపై ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పట్టణ నర్సరీ అని రాశారు. మున్సిపాలిటీకి చెందిన స్థలం తనదని ఓ ప్రైవేటు వ్యక్తి వచ్చి కమాన్‌ను, శిలాఫలకంను, అందులోని మొక్కలను తొలగించారు. గేటుపై పేరు, ఫోన్‌నెంబర్ రాసుకున్నప్పటికీ మున్సిపల్ కమిషనర్ మాత్రం అతడిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కమాన్‌ను యథాస్థానంలో ఏర్పాటు చేయిస్తున్న కమిషనర్

ఆడియో సంభాషణల కలకలం

ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన నర్సరీ స్థలాన్ని కందకట్ల మాధవరెడ్డి అనే వ్యక్తికి అప్పజెప్పడానికి స్థానిక బీఆర్ఎస్ నాయకుడు ముల్లి జంగయ్య యాదవ్, కమిషనర్‌ల మధ్య రహస్య ఒప్పందం కుదర్చుకున్నట్లు ఆడియోల సంభాషణలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. బోర్డు, కమాన్(స్వాగత తోరణం) తీయగానే డబ్బులు ట్రాన్స్‌పర్ చెస్తానన్నావుగా ఎమైందని జంగయ్య యాదవ్, మాధవరెడ్డిని అడిగినట్లుగా ఆడియోల్లో స్పష్టంగా ఉంది. ఈ విషయమై విషయమై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులైన వారిని కఠిన చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నర్సరీస్థలం తనదని మరో వ్యక్తి ఫిర్యాదు

ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన నర్సరీ స్థలం విషయమై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో మరో వ్యక్తి ఆ స్థలం తనదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 127లోని 1.ఎకర 39గుంటల భూమి తనదని ఎర్ర మైసయ్య అనే వ్యక్తి తెరమీదకి వచ్చి కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈభూమిని తనకు 1976వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం తనకు కేటాయించిందని పేర్కొన్నాడు. రెవెన్యూ రికార్డుల్లో అభూమి సీలింగ్ భూమిగా ఉన్నదని తనభూమిని కొనుగోలు చేసినట్లు చూపించి ఆక్రమించే యత్నాలు చేస్తున్నాడని తెలిపారు. తప్పుడు పత్రాలు చూపించి కన్వర్షన్ చేయించుకునే యత్నాలు చేస్తున్నట్లు అనుమానం కలుగుతున్నదన్నారు. మాధవరెడ్డి అనేవ్యక్తి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకొని తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరాడు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారి వెంకటరమణారెడ్డి

మోమిన్‌పేట్, మార్చి 1: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి వెంకటరమణారెడ్డి అన్నారు.మండలంలోని మొరంగపల్లి గ్రామ సమీపంలో గల వోల్టా గ్రీన్ కంపెనీలో శుక్రవారం ఫైర్ సెఫ్టీపై కంపెనీ కార్మికులకు అవగాహన కల్పించారు. కంపెనీలో అకస్మత్తుగా అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు సురక్షితంగా ఉండేందుకు వాడాల్సిన పరికరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వోల్టా గ్రీన్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ జయరాజ్, హెచ్‌ఆర్ శివరామకృష్ణ, అధికారులు శివకృష్ణ, సూపర్‌వైజర్ కె.లింగం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం




మర్పల్లి: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న రవీందర్

పెద్దేముల్, మార్చి 1: మండలంలోని నర్సాపూర్, గిర్మాపూర్, రేగొండి గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి జాతీయ ఉపాధిహామీ పథకం నుంచి సీసీరోడ్డు నిర్మాణానికి ఒక్కో గ్రామానికి రూ.5లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో సీసీరోడ్డు పనులు చేపట్టారు. గిర్మాపూర్‌లో ఎంపీటీసీ లొంకనీలు నర్సింహులు సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. నర్సాపూర్‌లో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఉప్పరి వీరేశం, ఉప్పరి రవీందర్, ఉప్పరి హన్మంతు, ఎన్నారం మల్లేశంలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్, మహిపాల్‌రెడ్డి, బోయిని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: బుచన్‌పల్లి గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ ప్రారంభించారు. రూ.2 కోట్ల 63 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రామ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మతల్లి బోనాలు



బోనాలతో ఊరేగుతున్న మహిళలు

మర్పల్లి, మార్చి 1: కోట మర్పల్లిలో శుక్రవారం ఎల్లమ్మతల్లి బోనాలు వైభవంగా నిర్వహించారు. ఎల్లమ్మ పర్శురాంల విగ్రహావిష్కరణ అనంతరం శుక్రవారం ఉదయం నుంచి గ్రామంలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో ప్రత్యేక నైవేధ్యాలు సమర్పించారు. 80 మంది మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

జయజయహే తెలంగాణ గేయాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడం హర్షణీయం



అందెశ్రీతో తెలంగాణ ఉద్యమకారుడు నవాబు రాజిరెడ్డి

మోమిన్‌పేట్, మార్చి 1: లోక కవి డాక్టర్ అందెశ్రీ రచించిన జయజయహే తెలంగాణ జననీ జయకేతనం గేయాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర గీతంగా ప్రకటించడం హర్షణీయమని జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారుడు నవాబు రాజిరెడ్డి అన్నారు. రాష్ట్ర సాధన సమయంలో పాఠశాల, కళాశాల విద్యార్థుల్లో తెలంగాణ భావజాలాన్ని రేకెత్తించి వారిని ఉద్యమం వైపు మళ్లించేందుకు జిల్లా వ్యాప్తంగానే కాకుండా, వివిధ జిల్లాల్లో బీఆర్ఎస్ పటిష్టతకు ఇన్‌చార్జిగా పనిచేసిన పలు ప్రాంతాల్లో ఈ గేయాన్ని స్వయంగా పాడి విద్యార్థులను చైతన్యపర్చినట్లు తెలిపారు. సహజకవి అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని రాజిరెడ్డి వివరిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఈ గేయాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించేందుకు నిర్ణయం తీసుకోవడం సంతోష దాయకమని అన్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే పూజలు

పూడూరు, మార్చి 1: మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలో విష్ణుగూడెం హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ దోమ మండల నాయకులు, మాజీ సర్పంచ్ రాంచంద్రారెడ్డి వేర్వేరుగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంటయ్య, శ్రీనివాస్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాములు, సుభాష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దోమ: మైలారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామిని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారి ఆలయంలో 108 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు ముదిరాజ్, ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్ రాజు, సురేందర్, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీను పాల్గొన్నారు.

పరిగి: పరిగిలోని గల శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్‌లు పాల్గొని పూజలు చేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో పరిగి, పూడూరు జడ్పీటీసీ బి.హరిప్రియ, ఎంపీ మేఘమాల, కౌన్సిలర్లు కృష్ణ, టి.వెంకటేశ్, నాగేశ్వర్‌రావు, శేఖర్, నాయకులు ఎస్‌పీ బాబయ్య పాల్గొన్నారు.



మైలారం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

శిక్షణ పొందిన మహిళలకు చేయూత



మాట్లాడుతున్న శకుంతల దేశ్‌పాండే

తాండూరురూల్, మార్చి 1: రోహిత్ అన్న మహిళా చేయూతలో శిక్షణ పొందిన మహిళలకు చేయూతనందించనున్నట్లు బీఆర్ఎస్ తాండూరు నియోజకవర్గ మహిళా కన్వీనర్ శకుంతల దేశ్‌పాండే తెలిపారు. మండలం లోని గౌతాపూర్ గ్రామంలోని ఆమె నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మహిళలు స్వయం కృషితో ఆర్థికాభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతో రోహిత్ అన్న మహిళా చేయూత పేరుతో 365 మంది మహిళలకు టైలరింగ్‌తోపాటు మగ్గంవర్క్‌లో 40రోజులపాటు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. బషీరాబాద్ మండలంలో 125 మంది, యాలాల మండలంలో 80మంది, పెద్దేముల్ మండలంలో 60 మంది, తాండూరు మండలంలో 40మందితోపాటు తాండూరు పట్టణంలో కొంతమందితోపాటు 365 మందికి వివిధ రంగాల్లో శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. వీరికి ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సర్టిఫికెట్లు అందించడం జరుగుతుందన్నారు. మహిళలు స్వయంగా ఎదిగేందుకు అపర్ణ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా పొడులు, పచ్చళ్లు, అప్పడాలు, చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను మార్కెట్‌లో తీసుకువచ్చి విక్రయించుకునేలా శిక్షణ అందిస్తామన్నారు. అదేవిధంగా అపర్ణ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఆధ్వర్యంలో 8వ తేదీ నుంచి రాగిజావ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిత్యం కొనసాగుతుందన్నారు.

ఎస్సీ వర్గీకరణ పూర్తయ్యే వరకూ పోరాటం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

యాలాల, మార్చి 1: ఎస్సీ వర్గీకరణ అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ యాలాల మండల నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు ప్రాణాలర్పించిన అమరుల వీరుల సంస్కరణ దినం సందర్భంగా శుక్రవారం ఏలూరు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వారికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సూర్యప్రకాశ్, జిల్లా నాయకులు మహేందర్, సీఐటీయూ నాయకులు బుగ్గప్ప, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేష్, కృష్ణ, మల్లేరి నర్సింలు, యాదప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి విద్యుత్ పథకం పేదలకు వరం



జీరో బిల్లును అందజేస్తున్న మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

శామీర్‌పేట, మార్చి 1: గృహజ్యోతి ఉచిత విద్యుత్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వినూత్నంగా రాష్ట్రచరిత్రలో గొప్పవరంగా అమలు చేస్తోందని తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అన్నారు. గతనెల 27న రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా శుక్రవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అర్హులైన పేదలకు విద్యుత్ శాఖ వారు ఇచ్చిన 200 యూనిట్ల జీరో బిల్ రసీదులను ఇచ్చి గృహజ్యోతి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ లైన్‌మెన్ మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ శంకర్‌గౌడ్, రామాలయ మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు నర్సింగ్, కొండ నాగేష్‌గౌడ్, జగదీశ్‌గౌడ్, తాటికొండ నవీన్, పిన్నింటి రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కులకచర్ల, మార్చి 1: తెలంగాణ శిక్షణ ఫౌండేషన్, హంస ఫౌండేషన్, విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ముజాహిద్‌పూర్ కాంప్లెక్స్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రాథమిక పాఠశాల దాస్యనాయక్ తండా విద్యార్థులు ప్రథమ బహుమతిని గెలుపొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శిక్షణ ఫౌండేషన్ తెలంగాణ సీనియర్ డైరెక్టర్ రమా, ఆపరేషన్ మేనేజర్ కాశీనాథ్, జడ్పీహెచ్ఎస్ ముజాహిద్‌పూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాములు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, శిక్షణ ఫౌండేషన్ జిల్లా సీనియర్ మెంటర్లు పాల్గొన్నారు.

రేపు మహనీయుల విగ్రహావిష్కరణ

దోమ, మార్చి 1: మండలంలోని మోత్కూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ, స్వామి వివేకానంద, పండగల సాయన్న విగ్రహ ఆవిష్కరణకు రేపు (ఆదివారం) ముఖ్యఅతిథిగా బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కే.మహేశ్‌రెడ్డి హాజరు కానున్నట్లు మాజీ సర్పంచ్ కేశవులు ఈ సందర్భంగా తెలిపారు.

బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్‌గా ఎన్నిక



నాగేశ్వర్‌రావును సన్మానిస్తున్న పాలకవర్గం

పరిగి, మార్చి 1: పరిగి మునిసిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఆరవ వార్డు కౌన్సిలర్ బి.నాగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులతో కలిసి ఏకగ్రీవ తీర్మానంతో నాగేశ్వర్‌రావు ఫ్లోర్‌లీడర్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావును మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్‌వైఎస్ చైర్మన్ ప్రసన్నలక్ష్మీ, కమిషనర్ వెంకటయ్య తదితరులు కలిసి సన్మానించారు.

ఈ నెల 9 వరకు ధరణి డ్రైవ్

వికారాబాద్, మార్చి 1: రైతులకు సంబంధించిన దరఖాస్తుల కోసం ఈ నెల 9 వరకు ధరణి డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సాయంత్రం సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. ఈనెల 9వ తేదీ వరకు రెవెన్యూ శాఖ ధరణి మాడ్యూల్ పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా జిల్లాలో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు ఎలాంటి పొరపాట్లు జరగకుండా మిగతా పరీక్షలన్నీ సజావుగా జరిగేలా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్‌లకు తీసుకెళ్లరాదని, ఎంపీడీవోలు, ఎంపీవోలను స్పెషల్ అధికారులుగా నియమించడం జరిగిందని, ఒక సెంటర్‌కు ఒకరిని నియమించామని చెప్పారు. పరీక్ష జరుగుతున్నప్పుడు పరీక్ష సెంటర్‌లో ఉండి పర్యవేక్షిస్తారన్నారు. విద్యార్థులు, ఇన్విజిలెటర్లు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఈఎంఆర్ఐలో ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

మేడ్చల్ టౌన్, మార్చి 1: ఈఎంఆర్ఐ(108)లో ఉద్యోగం చేయతలచిన వారి వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సంస్థ ప్రోగామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 4న, మేడ్చల్ పట్టణంలోని పోస్టాఫీసు వద్ద ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రైవర్, మెడికల్ ఎమర్జెన్సీ టెక్నీషియన్ల కోసం ఇంటర్వ్యూ నిర్వహిస్తునట్లు తెలిపారు. డ్రైవర్‌కు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణతతో పాటు బ్యాడ్జ్ నంబర్‌తో డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. మెడికల్ టెక్నీషియన్ ఉద్యోగానికి దరఖాస్తు చేయాలనుకున్నవారు బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం. బీ-ఫార్మా, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీలు చదివి ఉండాల సూచించారు. వయసు 23-35 సంవత్సరాల మధ్య కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

డాక్టరేట్ ప్రదానం

శామీర్‌పేట, మార్చి 1: ఓయూలోని డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్సెస్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంగాలో పరిశోధన (రిసెర్చ్) విద్యార్థి ఆకుల రాకేష్ ఫణీంద్రకు సంబంధిత అధికారులు శుక్రవారం డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశారు. ఆయన శామీర్‌పేటలో నివాసముంటు శామీర్‌పేటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైస్ కళాశాల్లో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఓయూలో డివైసింగ్ ఆన్ అప్రోచ్ ఫర్ ఈ టీ ఎల్ ఆపరేషన్ యూజింగ్ ఫంక్షన్ పాయింట్ అనాలసిస్ పరిశోధనను ఆకుల రాకేష్ విజయవంతంగా పూర్తి చేశారు.